# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 31-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ సామాజిక పింఛన్ల మొత్తాన్ని మరింత పెంచుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు.
- ❖ రేపటి నుంచి చౌక దుకాణాల ద్వారా రేషన్ సరకుల పంపిణీని ప్రారంభిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు.
- ❖ సంతోష ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి యోగా దోహదపడుతుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.
- ❖ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఈ రోజు నిర్వహించారు.
- ❖ ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన డీఎస్సీ 2025 హాల్ టికెట్లను విడుదల చేశారు.

======================

అవకాశం ఉంటే సామాజిక పింఛన్ల మొత్తాన్ని మరింత పెంచుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఈ రోజు ఆయన పర్యటించారు. ముమ్మిడివరం నియోజకవర్గంలోని చెయ్యేరు గున్నేపల్లిలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న మహిళలకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను ఆయన అందజేశారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... దేశంలో అన్ని రాష్ట్రాల కంటే అత్యధికంగా ఫించను మొత్తాన్ని అందిస్తున్నది ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని గుర్తు చేశారు. పేదలకు అండగా నిలవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని చంద్రబాబునాయుడు పేర్కొంటూ..

(వాయిస్ 34 సెకన్లు)

======================

చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ సరకుల పంపిణీని రేపటి నుంచి ప్రారంభిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వంలో ఇంటింటికీ వాహనాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ సక్రమంగా

జరగలేదన్నారు. అందుకే ఈ  విధానం అమలు చేస్తున్నామని చెప్పారు. ఇకపై ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల  నుంచి 12 గంటల  వరకు అలాగే సాయంత్రం 4 గంటలల నుండి 8 గంటల వరకు రేషన్ సరకులను డీలర్ల దుకాణాల వద్దనే చెప్పారు. పేద ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

=====================

రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఈ రోజు నిర్వహించారు. మొత్తం 63 లక్షల మందికి పింఛన్ ఇచ్చేందుకు ప్రభుత్వం 2 వేల 717 కోట్ల రూపాయలు  విడుదల చేసింది. అనకాపల్లి జిల్లాలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. నంద్యాలలోని బనగానపల్లె మండలం పలుకురు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీ.సీ. జనార్ధన్ రెడ్డి పంపిణీ చేశారు. అనంతపురం జిల్లా కూడేరు మండలం గోట్కూరు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్ల  పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను నిబద్ధతతో అమలు చేస్తోందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 34 సెకన్లు)

=====================

రాష్ట్రంలో 16 వేల 347 ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన డీఎస్సీ 2025 పరీక్ష హాల్ టికెట్లను ఈ రోజు విడుదల చేశారు. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ apdsc.apcfss.in ద్వారా తమ హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని సూచించారు. అభ్యర్థులు తమ వివరాలను ఎంటర్ చేసి హాల్ టికెట్లు పొందవచ్చు. కాగా,  డీఎస్సీ పరీక్షలు జూన్ 6 నుంచి 30వ తేదీ వరకు జరగనున్నాయి.  ఈ పరీక్షలకు రాష్ట్రానికి చెందిన వారితో పాటు ఇతర రాష్ట్రాల అభ్యర్థులు కలిపి మొత్తం 3 లక్షల 35 వేల 401 మంది దరఖాస్తు చేసుకున్నారని అధికార వర్గాలు తెలిపాయి.

=====================

ఊపిరితిత్తులు, క్యాన్సర్ వ్యాధులకు కారణమైన పొగాకు, గుట్కా, ఖైనీ వంటి మత్తుపదార్థాల నుండి  ప్రజలు దూరంగా ఉండాలని ఎన్టీఆర్  జిల్లా కలెక్టర్  లక్ష్మీశ కోరారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక కలెక్టరేట్ ప్రాంగణలో వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పొగాకు వల్ల కలిగే నష్టాలపై  ముద్రించిన అవగాహన పోస్టర్‌ను ఈ రోజు కలెక్టర్  ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతి ఒక్కరిని  చైతన్యవంతులను చేసి పొగాకు రహిత జిల్లాగా  తీర్చిదిద్దాలని జిల్లా ప్రజలను కోరారు.

విరామం

=====================

రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 5వ తేదిన జరుగనున్న ఏపీ లా సెట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని లా సెట్ చైర్మన్ ప్రొఫెసర్ ఉమ తెలిపారు. తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఈ రోజు జరిగిన పాత్రికేయుల సమావేశంలో ప్రొఫెసర్ ఉమ మాట్లాడుతూ... లా సెట్ పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా 27,253 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. 133 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని.. ఉదయం 9 గంటలు నుంచి 10 గంటల 30 నిమిషాల వరకు ఆన్ లైన్ పరీక్ష మొదలవుతుందన్నారు.

=====================

సంతోష ఆంధ్ర ప్రదేశ్ గా రాష్ట్రాన్ని తయారు చేయడానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్ వద్ద ఈ రోజు జరిగిన యోగా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దీర్ఘకాలిక వ్యాధులు మానసిక రుగ్మతల నుండి

విముక్తి పొందటానికి యోగా దోహదపడుతుందని తెలిపారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం విశాఖపట్నం వేదికగా నిర్వహించనున్నామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

======================

"పల్లె పండగ" కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఐదు వేల కోట్ల రూపాయల పనులు చేపట్టామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి శశి భూషణ్ కుమార్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం బంటుపల్లి గ్రామంలో ఈ రోజు ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... గ్రామాల రూపురేఖలు మార్చేందుకు పల్లె పండగ కార్యక్రమం తోడ్పాటు అందించిందన్నారు. ఈ పర్యటనలో శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు.

======================

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టిందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం మండలం వీర్ల గుడిపాడు లో సిమెంట్ రహదారులను ఆయన ఈ రోజు ప్రారంభించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. వీర్లగుడిపాడు నుంచి ముంబై నెల్లూరు జాతీయ రహదారిని అనుసంధానం చేస్తూ.. 25 కోట్ల రూపాయలతో రహదారిని నిర్మించనున్నామని వెల్లడించారు.

======================

మరాఠా వీరవనిత, మహారాణి అహిల్యా బాయి హోల్కర్ 3వ శత జయంతి వేడుకల సందర్భంగా రాజమహేంద్రవరంలో పై జంక్షన్ నుండి మంజీరా వరకు ర్యాలీ నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అరుణ్ సాహో, శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు, అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

======================

నైరుతి రుతు పవనాల ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులలో కొన్ని జిల్లాలలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఆ వివరాలను వాతావరణ శాఖ అధికారి వెల్లడిస్తూ...

(వాయిస్ 24 సెకన్లు)

======================

భారీ వర్షాలను ఎదుర్కొనడానికి జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ తన ఛాంబర్ నుంచి ఈ రోజు దృశ్య మాధ్యమం ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... వర్షాల కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకూడదని అధికారులకు స్పష్టం చేశారు.

======================
======================